కథ



# పనిమంతురాలు

ఎస్.జయ

**"ఎల్లమ్మా, యాడికొచ్చినావు. యాడికి బోతుండావు?" బస్సెక్కుతున్న సుబ్బన్న ఆడవాళ్ల ముందు సీట్లో కూర్చున్న మల్లమ్మను చూసి అడిగాడు. అదే సమయంలో సుబ్బన్నను బస్‌డ్రైవర్ ఆపేశాడు టికెట్టు తీసుకోమని.**

**ఎల్లమ్మ ఇచ్చే జవాబుకోసం చూడకుండా డ్రైవరు అడిగిన దానికి జేబులు తడుముకుని జేబులోంచి డబ్బుతీసి ఇచ్చి వెలుగోడుకు టికెట్ తీసుకున్నాడు**

**ఎల్లమ్మ కూడా ఏం మాట్లాడకుండా అంతసేపు వేచి వుంది. సుబ్బన్న టికెట్ తీసుకున్నాక అపుడు చెప్పడం మొదలుపెట్టింది.**

"ఈడికే వచ్చింటి, మనూరికే పోతుండాను"

"అవూ, నేను కూడా ఇన్యాను నువ్వు హైద్రబాదుకు పోయినావని, అవుగాని, వాల్లు నిన్ను జల్ది విడిచిపెట్టినారే"

"పిల్ల పెండ్లి పెట్టుకున్నాం. సర్లే, పొమ్మన్నారు" అని పకపకా నవ్వింది.

"అవుమల్లా పిల్ల పెండ్లి అంటే• వద్దన్నరు. పెండ్లెప్పుడు, నేను విన్లేదే. యా వూరికిచ్చినారు" అన్నాడు సుబ్బన్న. సీట్లో సర్దుకూర్చొని, తలకున్న తువాలును విప్పి కట్టుకున్నాడు.

ఎల్లమ్మ మాటలు వినడానికన్నట్టు కండక్టర్ పక్క సీట్లో కూర్చున్నాడు. అప్పుడప్పుడు ఆమె అతని వైపు చూడడానికి తల వెనక్కి తిప్పుతున్నది.

ఎల్లమ్మ వెంటనే జవాబివ్వలేదు. కాసేపు ఆలోచనల్లో పడింది.

"అవులే నువ్వు వూర్లో లేనప్పుడు మీ యత్త, మీ యాన చూసింటారు మంచీ చెడ్డ. నువ్వు పెండ్లి పిలగాన్ని కూడా చూసిండవు." అని సుబ్బన్ననే తన ప్రశ్నకు తానే జవాబిచ్చుకున్నాడు.

"పెండ్లెప్పుడైతే" అని మళ్లీ అడిగాడు.

"అబద్ధం ఎందుకులే అన్నా, పెండ్లి లేదు ఏమీ లేదు. అట్లా జెప్పితే పంపుతారని మావోల్లు చెప్పినారు. నేనుగూడా అదే మాట అని నమ్మిచ్చినాను. పోయిరాయితే ఒక నెల అని సాగనంపినారు. నీకు తెలియదన్నో అట్లా బొంకకపోతే పంపేటోల్లు కాదు."

"మల్లా ఎప్పుడు బోతావు?"

"ఇంగ పోనన్నా. ఆడ్నుంచి బయటపడ్డ్నీక గట్లా జెప్పినగానీ, ఇంగ పోనన్నా. కుతిక గోసినా పోనన్నా. కలో, గంజో తాగి తల్లిపిల్లలమంతా ఒక్కసాటనే వుంటమన్నా."

"ఎట్లా బోతివి ఆ యాల. నేనూర్ల లేను. వచానాక చెప్పిరి. నిన్ను హైద్రబాదుకు తోలుకపోయినారని."

"అవునన్నా ఆ యాల కార్ల దోలుక పోయిరి. మావోల్లంతా వూరి బయటదాక వచ్చినారు నన్ను సాగనంపనీక."

"మల్లా ఇప్పుడెవరొచ్చి నిన్ను బస్సెక్కిచ్చిరి?"

"ఎవరెందుకొచ్చి ఎక్కిచ్చారన్నా. ఇపుడు నా గడ్జు.నేనే వచ్చినాను. నేనొక్కదాన్ని ఈడిదానుక వచ్చి బసెక్కిన."

"ఎవరూ వదలనీక రాకుండానే నువ్వే బస్టాండు కనుక్కొని బస్సెక్కినావా? అసాధ్యురాలివే. అవులే వూర్లో అందరూ అనుకొనే మాట గదా. నాగమ్మ కోడలు మల్లమ్మ బలే వూసారైన పిల్ల. బలే వడుపుంది పిల్ల దగ్గర అని."

"ఏమో అన్నా అవన్నీ నాకు దెలవదు. మనూరికి రావాలనిపిచ్చింది. ఇగంతే, అడుక్కుంటూ వచ్చి బస్సెక్కినా."

"నిన్ను బస్సెక్కీయనీక ఎవలూ రాల్యా?" మల్లమ్మ మాటలు నమ్మలేక మళ్లీ రెట్టించి అడిగాడు సుబ్బన్న.

"వాల్లెందుకొచ్చారన్నా, నీ తిక్కగాని.నేనైతే గిదంతా ఆలోచన చేయలేదు. వూరికి పొమ్మన్నారు గది చాల్లే దేవుడా అనుకుంటా వచ్చినాను. మనూరొల్లు కనిపించక, మన మాట వినిపించక ముకం వాచిపోయిందనుకో. ఈడ్నుంచి బయటపడతానా, ఈన్నే నా కాలం ఎల్లమారిపోతాదా అని గుండె పగిలి చచ్చిపోయినాను.


బయటపడ్డ్నీక పిల్లపెండ్లి అని జెప్పితే పంపుతారని జెప్పిన.

పెండ్లి వుత్తదే. పెండ్లి జేయనీక దుడ్లాడుండాయి. పోయినేడు వానల్లేకపాయా, పనులు లేకపాయ. ఎట్ల బతుకున్నమో ఏమో. పెండ్లిండ్లా జేచ్చామన్నామనం. మనమేమన్నా గవర్నమెంటోల్ల కాడ జీతాలు జేచ్చున్నామా? వాల్లకు నమ్మకం కలగనీక గట్లా జెప్పిన. కాదనకుండా పంపిరి. లేకపోతే పంపకపోయేది వాళ్లు. వూరికి పోదువులే అనంగానే పోయేపానం లేచొచ్చినాది. ఒక్కదాన్ని రోడ్డు మీదకొచ్చినాను ఈ సంచి తీసుకొని" అని ఒళ్లో పెట్టుకున్న చిన్న బట్టసంచి చూపించింది.

"రోడ్డు మీనకొచ్చి చూచ్చే అన్నా, వా యబ్బో ఎన్ని ఆటోలు, ఎన్ని బస్సులు బుస్సు బుస్సుమని పొగ వదులుకుంట పోతనే వున్నాయి. ఏం పొగ పాడు పొగ. కంపు వాసన. కట్టెల పొయ్యి ముందు కూచున్నట్టు ఒకటే కల్లు మంట. నేను ఇన్నాల్ల సందీ కట్టెల పొయ్యి ముందు కూచోలేదేమో ఇంగా కల్లు మండినాయి.

రోడ్ల మీన యాడ జూసినా మనుసులే. కాని తెలిసినోల్లు కాదు. మన మాట కాదు మన యాస కాదు. ఉన్నోల్లను వదులుకొని, పట్నంల ఏం బావుకుందామని వచ్చినారో ఇంతమంది జనం. పుట్టలోంచి బయటపడ్న సీమల్లాగా బార్లు కట్టి పోతుండారు. మనూల్ల ఏడాదికొక్కరోజు జరిగే తిరునాల్లలో జనాన్ని చూచ్చే సంబరమయితాది గానీ, పొద్దుగూకులు ఇంత మందిని చూసుకుంటూ, చెవులు చిల్లులు పడే గోల యింటూ వుంటే ఈ పట్నంల జనానికి పిచ్చిపట్టదా? ఏమో నాయినా నేనైతే ఈ పట్నంలో బతకలేను. అందుకే వూరికిపోతుండాను."మనసు దీర మాట్లాడుకోడానికి కొన్నాళ్లుగా ఒక్క మనిషి కూడా లేకపోవడంతో సుబ్బన్న ఒకటడిగితే మల్లమ్మ మరి రెండు మాటలు ఎక్కువ చెప్తోంది. మహానగరంలో ఒకే బస్సులో ఒకే వూరి వాళ్ల కలుసుకుంటే వాళ్ల పరిసరాల్నే మరిచిపోయి మాట్లాడుకోవడం సహజమే.

మల్లమ్మ బస్సెక్కినప్పుడు బస్సులో ఎవరూ లేరు. సుబ్బన్న ఎక్కే సరికి పదిమంది వున్నారు. వాళ్లు వాళ్ల వూర్లో వున్నట్టు మాట్లాడుకుంటున్నారు. బస్సు మనుషులతో నిండిపోయింది చూళ్లేది ఇద్దరూ. డ్రైవరు బస్సుస్టార్టు చేసింది గమనించలేదు. వెనక్కి తీసుకున్న బస్సును డ్రైవరు సడెన్ బ్రేక్‌తో ఒక్కసారిగా ఆపడంతో బస్సులో కూర్చున్నవారు ముందుకు వెనక్కి వూగారు. కొందరు సీట్లకు కొట్టుకున్నారు. కొందరు సీట్లలోంచి పడబోయి తమాయించుకున్నారు. ఆ కుదుపుకు మల్లమ్మ, సుబ్బన్నకూడా కొంచెం కదిలారు కాని, సీట్లకు కొట్టుకో లేదు. వాళ్లు బస్సులో వున్నామన్న సంగతి గుర్తించారు. మాటలు ఆగిపోయాయి. కాని తమ చుట్టూ వున్న మనుషుల్ని చూసి నవ్వుకున్నారు. చిన్నపిల్లలు కిందపడితే నవ్వినట్లు నవ్వారు. పిల్లలు మరీ ఏడవకుండా 'దుడ్లు పడ్డాయి ఏరుకో' అంటే పిల్లాడు ఏడుపు మాని అటు ఇటు చూస్తే పెద్దలు చిలిపిగా నవ్వినట్లు నవ్వారు.




“తిని లావవుతారే కాని బలమేం వుండదు వీళ్ల కాడా. గట్టిగ కూర్చోలేరు. గట్టిగ నడవలేరు.” అంది మల్లమ్మ.

నిజంగానే,ముప్పైమూడేళ్ల మల్లమ్మ రివటలగా సన్నగా వుంటుంది. చలాకీగా నడుస్తూ గబగబా పనులు చేస్తుంది. ఆమె చేతల్లో, నడకల్లో ఒక రిథంతో కూడిన వేగం వుంటుంది. పనిచేస్తున్నంత సేపు ముఖం చెమటతో తడిచిపోయి తళతళ మెరుస్తూ వుంటుంది. ఆమెను చూస్తే కష్టజీవి అనుకోకుండా ఎవరూవుండరు. నిగారింపైన నలుపు రంగులో, ముక్కూ ముఖం తీర్చిదిద్దినట్లు వుంటాయి. ఎక్కడ ముఖమ్మీద కండబట్టి వుండదు. చక్కటి ముక్కు, తళతళలాడే తెల్లటి పెద్ద కళ్లు. నున్నగా తల దువ్వి ముడికట్టింది. కొంచెం తెల్లబడినట్లు కనిపించింది.

పొలం పనులకు వెళ్లకుండా నీడపట్టున వుండేమో అట్లా వుందనుకున్నాడు సుబ్బన్న.

బస్సును సడెన్‌గా ఆపబట్టి సరిపోయింది కాని, లేకపోతే మరో బస్సును ఢీకొట్టేది. బస్సును మరోసారి స్టార్ట్ చేశాడు డ్రైవర్.

పేటలోనే కాదు, వూర్లో కూడా మల్లమ్మ పనిమంతురాలని, అందరికి ఆమె మీద మంచి గురి. ఆమె పొలం పనికి వచ్చిందంటే ఆ పని ఆ రోజు పూర్తయి తీరుతుంది అనుకొనేవారు కాపదనం వాళ్లు. మునుం పట్టుకొని ఆమె కలుపు తీసినా, కోతలు కోసినా ఆమె ముందుండేది. తన జట్టునంతా ఉల్లాసపరుస్తూ పని వేగంగా సాగిపోయేట్టు చేసేది.

మల్లమ్మ మనసులో ఉద్వేగం చెలరేగింది. బస్సులో కూర్చున్నా తన కాళ్లు తన ఊరి వైపుపరుగులు తీస్తున్నట్టు ఫీలయింది. బస్సు వేగంలో మాటలు వినిపించక ఇద్దరు మాటలు మానేశారు.

నిజానికి, ఆమె బస్సులోకి ఎక్కిన కాసేపటికే తన మాట యాస నలుగురి నోట వినగానే తను తన వాళ్ల మధ్య వున్నట్టు అనుకుంది. సుబ్బన్నను చూడగానే మల్లమ్మకు ప్రాణం లేచొచ్చినట్టయింది. బస్సులో ఊరిమనిషి కనిపించే సరికి ఆమె తన వూర్లో వున్నట్టు అనుకుంది.పక్కన మరొక చదువుకున్న స్త్రీ వున్నా తను ఒక్కతే సీట్లో వున్నట్లు ఒంటరితనం పొందింది. చదువుకున్నోళ్లను చూస్తే ఇప్పుడామె ఏవగించుకొంటోంది. ఆ ఒంటరితనంలో తన వాళ్లను తలుచుకుంది. తన వూరిని గుర్తు చేసుకుంది.

** ** **

ఆమె పేటలోనే కాదు, వూర్లో కూడా మల్లమ్మ పనిమంతురాలని, అందరికి ఆమె మీద మంచి గురి. ఆమె పొలం పనికి వచ్చిందంటే ఆ పని ఆ రోజు పూర్తయి తీరుతుంది అనుకొనేవారు కాపదనం వాళ్లు. మునుం పట్టుకొని ఆమె కలుపుతీసినా, కోతలుకోసినా ఆమె ముందుండేది. తన జట్టునంతా ఉల్లాసపరుస్తూ పని వేగంగా సాగిపోయేట్టు చేసేది. అంతేకాదు ఆమె పక్కన మునుం పట్టి, అంత వేగంగా పని చేయాలని కొందరైనా ఉత్సాహపడేవాళ్లు. కాని ఆమె తన పక్కన కొత్తగా పనికొచ్చే పిల్లలోన, లేదా వృద్ధాప్యంతో పనిలో వెనుకబడేవారినో తన పక్కన మునుం పట్టిచ్చేది. వాళ్లను తనతో తీసికెల్లడానికి ఒక సాలులో తనే పని చేసేది. ఒకే చేన్లోనే కదా మునుం పట్టుకున్నాం, నన్ను దాటుకుంటూ వెళ్లండని ఉత్సాహపరిచేది. నవ్వులతో, కేరింతలతో సాయంత్రం పొద్దుపోయేదాకా పనిచేసేది. చేయించేది. పనిమొదలు పెట్టడంలో, ఆపడంలో నియమాలు పాటించేది. ఏ కామందు కాని, పొలం ఆసామికాని, తానున్న జట్టు పనిని వేలెత్తి చూపించుకోవడం ఆమెకు నచ్చేదికాదు. మల్లమ్మ ఒళ్లు దాచుకోకుండా పనిచేస్తుంది. ఏ చేనికిపోయి నా సొంత పొలం పని చేసినట్టు చేస్తుంది అనుకునే వారు.

పైరు పొలాన్ని చూసే ఆమె కళ్లు ఆనందంతో మిలమిలలాడేవి. ఎంత పంట పండబోతుందో సరిగ్గా తూచినట్టు చెప్పేది. పచ్చని పైరు పంటల మధ్య, స్వచ్ఛమైన పైరుగాలుల మధ్య పుట్టి పెరిగింది మల్లమ్మ. కోత పనులు పూర్తయిన వాళ్ల ఆ ఏడాది తమకు బాగా పని చేసిందని మల్లమ్మకు తిరునాల్లో గాజులు వేసుకోమనో, లేకపోతే రవిక కుట్టించుకోమని ఒక బ్లౌజు ముక్కనో కాపదనం ఆడోల్లు ఇచ్చేవాళ్లు. తనను సంతోషపెట్టడానికి, పనికి గుర్తింపుగా ఇస్తున్నారని ఎరుక ఆమెకు వుండేది. 'మంది వుచితంగా ఇచ్చినవాటి తోనే బతకలేం కదా! మన రెక్కలు బాగా ఆడినన్ని రోజులే ఇవన్నీ' అనుకునేది.

ఆ పేటకు కొత్తకోడలు వచ్చినా పిల్ల పనిమంతురాలేనా? నాగమ్మ కోడలు మల్లమ్మలాగా వుంటాదా?

'ఎట్లాటి పుటుక పుట్టినాదో కాని, ఎంత పనిచేస్తున్న ముకమ్మీన నవ్వు మాయం కాదు. పనిలో అంత ఒడుపు యాడ నేర్చినాదో' అని సంబరంగా చెప్పుకునే వారు.

కొత్త పని చూస్తే చాలు యాట్టే పట్టేస్తాది. ఒక మాటన్నా ఓర్చుకుంటాది. అంత తమ అదృష్టం. ఇట్లా కష్టంజేసే పిల్ల పెల్లాంగా దొరకడం తన కొడుకు అదృష్టం అనుకునేది నాగమ్మ.

ఆ ఏడాది అదనుకు వానలు కురవలేదు. కొందరు పొలాల్లో విత్తనాలు కూడా వేసుకోలేకపోయారు. ఇది ఆ ఒక్క వూరు పరిస్థితే కాదు. దేశమంతటా అదే స్థితి. కలుపులు తీసే సమయానికే కూలి రేటు సగానికి సగం తగ్గింది. ఇరవై రూపాయలకే కూలికెల్లారు. మరి రెండు నెల్లకు మినుప్పంట చేలోనే ఎండిపోయింది. శనక్కాయ పంట సగం మందికే వచ్చింది. అది కూడా విత్తనం వేసినంతనే దిగుబడి వచ్చింది. మిరప తోటలు మాత్రం విరగగాసాయి. కాని పని కోసం అందరూ ఎగబడడంతో రోజుకు పదిహేను రూపాయలే కూలి ఇచ్చినారు. ఏమైందో ఏమోగాని ఆ ఏడాది బీటా పత్తి పండలేదు. పత్తిచేను ఎప్పుడు చూసినా అమాసనాటి రాత్రి చుక్కలు కనిపించినట్టు తెల్లగా మిలమిలలాడుతూ కనిపించేది. ఆ ఏడాది వెన్నెల రాత్రి చుక్క లు సరిగా కానరానట్టు, చెట్టుకు రెండు మూడు

కాయలు పగిలి, కాయల్లోంచి పత్తి సగం సగమే తొంగి చూసింది.

రైతులు పంటలు లేక బిక్కమొగం వేస్తే, కూలీలు పనులు లేక, కడుపులు మార్చుకుంటూ వుసూరుమంటూ దిగాలుపడ్డారు. కాలమెట్లా వెల్లదీయాలో అని చింతపడడం ఒకటే పనిగా అయింది అందరికీ.

కొందరు బతకడానికి పట్నానికి పోదామనుకుంటే, వున్న వూరు కన్నతల్లి లాంటిది. కానని రాజ్యంలో ఎన్ని అవస్థలు పడాలో వూరిడిసి పోవద్దు అని మరి కొందరు అనుకున్నారు.

> ఆ యమ్మ ఒక్కనాడన్నా నేను బాగొండినానని మెచ్చుకోలేదు. పతిదానికి వంకలు పెట్టేది. వంకలు పెట్టకపోతే ఆ యమ్మ గొంతులో ముద్ద దిగేది కాదు. ఎప్పుడూ అయినదానికి కానిదానికి ఒకటే సణుగుడు. ఒకటే ముకం మటమటలాడించుకోవడం. నువ్వేమైనా చెప్పు ఆయమ్మమంచిది కాదు"

"ఉన్న వూరొదులితే, పిల్లలేడ ఆడుతారు? యాడ చదువుకుంటారు. ఆడోల్లను ఎంటబెట్టి కెల్లి యా రోడ్ల మీన పడుకుంటాం. తలదాచు కోడానికి నీడ కావాలంటే అద్దెలు కట్టాల. యాడ్నొంచి వచ్చాయి దుడ్లు. పని ఇయ్యండని ఎవర్ని అడుక్కుంటాం. మన గేరికొచ్చి పిలిచి నొల్లకే పనికి పోయేటోల్లం. పట్నంబోయి, పని ఇయ్యండని అడుక్కుంటామా? ఇంత బతుకు బతికి దిక్కుమొక్కు లేకుండా పిచ్చి కుక్క చావు చావాల్నా? చస్తే ఇక్కడే చద్దాం. మన చావుకు ఏడ్చేవాల్లు లేకుండా ఏం బతుకులు. వద్దు పట్నం పోవద్దు. ఇక్కడే బతుకుదాం" అనుకున్నారు మల్లమ్మ కుటుంబం.

నాగమ్మను శంకరమ్మ దొరసాని అడగనే అడిగింది, "నాగి, యా వూరికి పోతుండారే బతకనీకి" అని.

"యాడ బోతమమ్మా, కలో, గంజో ఒక పూట తింటే చాలు యాడికి బోవద్దు అనుకున్నాం."

"నా బిడ్డతానికి వంటజేయ బోతావా? లంకంత ఇల్లు. ఇల్లంతా చక్కబెట్టనీక ఒక మనిషి ఉన్నాది. వంటజేయనీకనే ఒకరు కావాలంది నా పెద్ద బిడ్డ. హైదరాబాదులో వుంటదే సుజాతమ్మ కాడికి బోవాల."

"నాక్యాడ వచ్చాయమ్మ,పొద్దున్నలేచ్చే వాళ్లకు టిఫిన్లు అవీ గావాల."

"లేదే ఇప్పుడు పట్నమోల్లు టిఫిన్లు అవీ తినడంలేదు. టిఫిన్లలో నూనెలు పానాలు బుగుండవని.

ఆరోగ్యానికి మంచిదంటూ మన జొన్న రొట్టెలు, పొద్దున్నే జొన్న రొట్టెలు, పొద్దున, సాయంత్రం, రాగి గటక కావాల వాళ్లకు. రొట్టె లొచ్చినోల్లు కావాలని సుజాతమ్మ అడిగింది. వాళ్లు తినేదే తింటావు. నెలకు ఐదొందలు ఇప్పిచ్చా" అంది శంకరమ్మ.



"నాకేడతది. నా కోడలు ఒడుపున పిల్ల. ఆ గ్యాసుపొయ్యిలు, అవి ఒకసారి చూపిస్తే చేచ్చాది. మల్లమ్మను పంపుతా."అని మాట ఇచ్చింది.

మల్లమ్మ మొదట ఒప్పుకోలేదు. "రెండు నెలలు చూసి, పిల్ల పెండ్లి అని పిలిపించుకుంటాం. బాగానే వుంటే పోతావు. మాట ఇచ్చి వచ్చిన, నా మాట పోతది" అని బతిమాలింది నాగమ్మ కోడల్ని.

అదే వారంలో శంకరమ్మ హైదరాబాదు పోతూ, కార్లో మల్లమ్మను తీసుకొని వెళ్లి దిగబెట్టి వచ్చింది.

** ** **

బస్సు వెలుగోడు చేరేసరికి తెల్లగా తెల్లారింది.

మల్లమ్మ వస్తున్నదని ముందు రాత్రే ఫోన్ చేసి చెప్పింది తల్లికి సుజాతమ్మ. శంకరమ్మ నాగమ్మకు కబురు పంపింది తెల్లారేసరికల్లా మల్లమ్మ వూరికి వస్తున్నాదని.

బస్టాండులో అత్తను, భర్తను చూసి మల్లమ్మకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. వస్తున్న దుఃఖాన్ని గొంతులోనే దిగమింగుకుంది.

మల్లమ్మ ముఖం ఏదో పోగొట్టుకున్నదానిలా వుంది. పోయినప్పుడు వున్నంత వుసారు లేదు పిల్ల. ఆ వూరు, ఆ పని నచ్చలేదేమో అనుకుంది నాగమ్మ.మల్లమ్మ చేతిలోని సంచినితీసుకుని ముందు నడిచింది.

"అంతా బాగున్నారా? పిల్లలు బాగున్నారా, వూర్నించి మా నాయన్నో,అమ్మనో పిల్లల్ని చూసిపోయినారా?" అని ఏవేవో ప్రశ్నలు గుప్పించింది ఇంటికి వెళ్లే దార్లో.

ఇంటికి వెళ్లేసరికి ముగ్గురు పిల్లలు తల్లిని చూడగానే చుట్టుకున్నారు. మల్లమ్మకు దుఃఖం ఆగలేదు. అత్త భుజమ్మీద చేయి వేసింది సముదాయించినట్టు. తల అడ్డంగావూపింది, ఏడ్వవద్దని సైగచేస్తూ.

పెద్దమ్మాయి వేణ్నీలు తోడి జాలాడిలో పెట్టి వచ్చింది. ఆమె స్నానం చేసేసరికి ప్రయాణం బడలికంతా మటుమాయం అయింది. మనసు కూడా తేలికపడింది. తన ఇంట్లోనే తాను వున్నానను కునేసరికి ఆమె గుండె దిటవు అయింది. హైదరాబాదు పోయి రావడం ఒక కలలాగా వుంది ఆమెకు.

అందరూ కలిసి రొట్టె, కాసింత వుల్లిగడ్డల కారం నంజుకొని తిన్నారు. అందరితో కలిసి తింటుంటే మళ్లీ ఆమె కళ్లల్లో నీళ్లు వుబికాయి. ఇట్లా అందరూ కలిసి తినడం అలవాటై, హైదరాబాదులో ఒక్కతే తినాలంటే ముద్దగొంతులో దిగేది కాదు మల్లమ్మకు.

కాసేపు నిద్రపోయి లేచి చెంబునిండా నీళ్లు తాగింది. అదే మధ్యాహ్నా భోజనమని ఆమె కు తెలుసు. అయినా మనసు ప్రశాంతంగా, సంతోషంగా వుంది. దిగులుపోయి, ముఖం తేటపడింది. కోడలి ముఖం చూసి నాగమ్మ మనసు కుదటపడ్డది.

రాగానే కోడల్ని ఏమేమో అడగాలనుకున్నా ఆమె ముఖం చూసి అడగలేకపోయింది నాగమ్మ. ఇప్పుడు అడగకుండా వుండలేకపోయింది.

"ఆ యమ్మ బాగానే చూసుకుందా నిన్ను. కడుపు నిండా తిండి పెట్టేదా?"

"తిండికేం లోటు లేదు. నేను చేసేదే, అందరూ తిన్నాక నేనే పెట్టుకొని తినేది. కాకుంటే ఒక్కదాన్ని కూర్చుని తినాలంటే ముద్ద గొంతు దిగేది కాదు." అంది ముక్తసరిగా.

"పని బాగుండేది. ఆ యమ్మ మెచ్చేదా?"

"పనికేం బాగుండేది. పొద్దున ఐదుకంతా లేచి స్నానం చేసి గిన్నెలు కడిగి, కాఫీ చేసి, ఒక కూర, పప్పు చేసి రొట్టెలు చేసేది. పిల్లలకు ఉప్మా, పూరీలు, దోసెలు, చట్నీలు, కోడిగుడ్డు అట్లు పోసేది. అన్నం కూడా తొమ్మిదికంతా అయిపోవాలి. ఆఫీసులకు వెళ్లిపోయేవాళ్లకు టిఫిన్లు కట్టివ్వాలి. బళ్లకు, ఆఫీసులకు అంతా వెళ్లిపోగానే నేనూ వుదయంపూట తిని, మళ్లీ వంటకు పెట్టేదాన్ని. పిల్లలకు కారియర్లు వెళ్లేవి. వరన్నంతో పాటు కొర్రన్నం చేసేదాన్ని. సుజాతమ్మ వాళ్లత్త ఇంట్లోనే వుండేది. ఆ ముసలమ్మకు, సుజాతమ్మ భర్తకు చక్కెర వ్యాధి అంటా, పగలు కొర్రన్నం, రాత్రి గోధుమ రొట్టెలు చేసేది. మల్లా, కూరలు, పప్పు, సాంబారు, రాగుల గట్కా. అందరూ తిని నిద్రపోయాక నేను తిని నిద్రపోయేసనికి పదకొండన్న అయ్యేది. పడుకున్న కాసేపటికే నిద్ర లేచినట్టు వుండేది. ఈ రెన్నెల్లు కంటినిండా నిద్రలేదు. ఇంట్లో వుండేది ఐదు మందే కాని, అదేం తిండో. ఎన్ని రకాలు చేసేదాన్నో, చేయ్యడం కడగడం ఇదే పని ముప్పొద్దుల."

ఒక్కరోజులో మూడుసార్లు వండడం, అవి అన్ని రకాలు వండడం గురించి విని ఆ పిల్లలు పెద్దలు ఆశ్చర్యపోయినారు. వాళ్లు తాను చెబుతున్నది అబద్ధమనుకుంటురేమోనని అనుమానం కలిగింది మల్లమ్మకు.

"మొదటి మూడు రోజులు నాకే ఆశ్చర్యం వేసింది.నాకు పని వచ్చో రాదో చూడ్నీక ఇవన్నీ చేయిస్తున్నాదేమో అనుకున్నాను. వండినవేవీ

మిగలకుండా అయిపోయేసరికి నాలుగైదు రోజులకు అర్థమయినాది. ఈ ఇంట్లో ఇలాగే తింటారు, రోజు నేను ఇన్ని రకాలు వండాలి అని. మనిషి వుందికదా చాలారకాలు చేయించేది, ఎవరికి ఏ పూట ఏం కావాలో అది చేయమనేది. మరి వాల్లయితే అన్నిరకాలు పూటకు వండుకుంటారా? కాని యాసిరిక పడకుండా అన్ని చేసేదాన్ని. ఆ యమ్మ ఒక్కనాడన్నా నేను బాగొండినానని మెచ్చుకోలేదు. పతిదానికి వంకలు పెట్టేది. వంకలు పెట్టకపోతే ఆ యమ్మ గొంతులో ముద్ద దిగేది కాదు. ఎప్పుడూ అయినదానికి కానిదానికి ఒకటే సణుగుడు. ఒకటే ముకం మటమటలాడించుకోవడం. నువ్వేమైనా చెప్పు ఆయమ్మ మంచిది కాదు" అని తేల్చేసింది మల్లమ్మ. మామూలుగా ఏదో అడుగుదామనుకుంటే మల్లమ్మ మనసును కందిరీగల తుట్టెలాగా చెదరగొట్టినానే అనుకుంది నాగమ్మ.

ఆమె మనసును మళ్లించడం కోసం మరో ప్రశ్న వేసింది.

"సుజాతమ్మది లంకంత ఇల్లు. ఇల్లంతా చలువరాతి బండలు పరిచినారంట. పాలుపడితే పాలు కనిపించవు. అంత తెల్లగా వుంటాది ఇల్లు అని శంకరమ్మ తెగ మురిసిపోతుంటాది. నిజమేనా మల్లమ్మా" అని అడిగింది వుత్సాహంగా.

జైల్లో వున్నట్లు వున్నాది ఇని దినాలు నాకు. జైల్లోనన్నా ఆల్లు ఈల్లు కనిపిస్తారు. అటు ఇటు మెదల్నీక వుంటాది. ఇదేందో, వంటిల్లు దాటి రాకు, తొంగి చూడమాకు అని పోతేనే చెప్పబట్టే ఆ యమ్మ. ఆ వంటిల్లు కన్నా జైలే నయం. నన్ను మల్లా ఆడికిపోమ్మంటే పోను. గిన్నెల్లో వండడం, గిన్నెలు కడగడం పొద్దంతా ఇదే పని. నా వల్లగాదు.

"ఏమో అత్తా, లోపల ఎంతున్నాదో, ఎట్టున్నాదో చూడలేదు. పోయినప్పుడు, కారు దాగినప్పుడు ఇంటి ముందు నిలబడి చూసినాను, ఇల్లు పెద్దగున్నాది అనుకున్నాను. కారు డ్రైవరు నన్ను ఇంటి గోడపొంటి తీసుకపోయి వంటింట్లో వదిల్నాడు. వంటింట్లోకి వెళ్లేముందు గిన్నెలు, బట్టలు వుతకడానికి మోరీ అంట,మన జాలాడి అంటామే అది వుంది. ఆ మోరీ, వంటిల్లు తప్ప ఇంగ ఇల్లు ఎంతుందో, ఎట్లా వుందో చూడలేదు.

జైల్లో వున్నట్లు వున్నాది ఇని దినాలు నాకు. జైల్లోనన్నా ఆల్లు ఈల్లు కనిపిస్తారు. అటు ఇటు మెదల్నీక వుంటాది. ఇదేందో, వంటిల్లు దాటి రాకు, తొంగి చూడమాకు అని పోతేనే చెప్పబట్టే ఆ యమ్మ. ఆ వంటిల్లు కన్నా జైలే నయం. నన్ను మల్లా ఆడికిపోమ్మంటే పోను. గిన్నెల్లో వండడం, గిన్నెలు కడగడం పొద్దంతా ఇదే పని. నా వల్లగాదు. ఆ యమ్మ కాడా పని చేయమంటే" అని చెప్పింది, చివరి మాటలు చెబుతున్నప్పుడు ఆమె గొంతు జీరబోయింది. కళ్లల్లో మళ్లీ నీళ్లు వుబికాయి. వింటున్న నాగమ్మకు, పిల్లలకు వాళ్లకు తెలీకుండానే చెంపల మీదనుంచి కన్నీళ్లు కారిపోయాయి.

"ఊర్లో ఏపనికి భయపడని పిల్ల, తూనిగలాగా తిరిగిన పిల్ల పట్నం పనికి భయపడినాది. నీడపట్టున పనిగదా, వంటపని అంటే అదేమంత పని. మల్లమ్మ చిటికెన వేలుతో జేచ్చాది, పిల్ల మంచిగ తిని సుఖపడతాది అనుకున్నాను గానీ ఈ తీరుగా నిద్రలేక, పలుకుదోడు లేక కోడలు బిక్క చచ్చిపోయినాద"ని నాగమ్మ అర్థం చేసుకుంది.

"అమ్మా, మల్లా పట్నంపోవద్దే అంది" అర్థం చేసుకున్న పెద్దపిల్ల. మల్లమ్మ అత్తవైపు చూసింది. నాగమ్మ కూడా "వద్దులే అమ్మా, ధైర్నం వున్న దానివి, ఏ పనికి వెనుకదీయవు. నువ్వే అంత గుండె పగిలినట్లు మాట్లాడితే, ఇంగ ఆ పని వద్దు" అని కోడలి తలమీద ఆప్యాయంగా నిమిరింది నాగమ్మ.

కొంగుతూ కళ్లు తుడుచుకొని, ముక్కుచీదుకుంది మల్లమ్మ. అత్త సముదాయించినా, తనను ఇంట్లో అర్థం చేసుకునేవాళ్లున్నా, ఓడిపోయానన్న ఒక అవమానం ఆమె గుండెను మెలిపెడుతూనే వుంది.

నాగమ్మనే మల్లా కోడల్ని అడిగింది, 'మల్లీ, ఏమన్నా దుడ్డు ఇచ్చిందా ఆయమ్మా?"

ఏ పనికి వెళ్లొచ్చిన మల్లమ్మ కూలి డబ్బులు రాగానే అత్త చేతిలో పెట్టేది. మనసుకు కష్టంగా వుండి మరిచిపోయిందేమో తనకివ్వడానికి అని అడిగింది నాగమ్మ.

మల్లమ్మ ముఖం బాధతో నల్లబడింది. "పిల్ల పెండ్లని వచ్చిన రొన్నెల్లకే పోతుండావు. పని మధ్యలో మానేసి పోతుండావు. మీ ఇంట్లో నలుగురున్నోల్లు, నువ్వు ఆర్నెల్లు చేసి ఎలితే, మీ యాత్త కొన్నాల్లు, నీ బిడ్డలు కొన్నాల్లు జేచ్చారని మా యమ్మ జెప్పె. యాడది జేచ్చనే మీకు దుడ్లు ఇచ్చేది. ఒకటి రెండు నెలలు జేసి దుడ్డు కావాలంటే యియ్యమని కరాఖండిగా జెప్పినారు. పట్నమోల్ల నీతి ఈ కాడికున్నాది. ఎన్నాల్లు జేసినా, జేసిన కాడికి, తిన్నకాడికి అంటారనిపిచ్చినాది.

శంకరమ్మ దొరసానితో ఏం మాట్లాడుకున్నావో ఏమో నా కెరుకల్యా. పోయి పని జేయమంటే జేసినాగాని, ఇంగ పొమ్మంటే ఆ పనికి జచ్చిన బోను.జైలుకు పొమ్మన్నా బోతాగాని, ఆపనికి మాత్రం బోను."

"ఏనాడు ఎదురుబొదురుగా కూచుని ఇన్నిన్ని మాటలు మాట్లాడింది గాదు మల్లమ్మ. దాని మనసు చెదిరినాది. ఇంగ ఆ ఇసయాలు ఎత్తగూడదు" అనుకుంది నాగమ్మ.

●

# ఉమ్మడి స్వప్నం

జరగాల్సిన విధ్వంసం జరిగేపోయింది
కొమ్మెక్కి కూర్చున్న కోయిల స్వరం మారింది
ఉమ్మడి కలల్ని పోగేసి సందిట పట్టుకున్నది

అమ్మ మనల్ని ఇద్దరిగా కన్నది
ఎవరిగా జీవిస్తావో ఎవరిగా మరణిస్తావో నీ యిష్టం
పంచుకోవడం ఒక ఆదిమ సౌఖ్యం
ఆకు వక్క, పక్క మరేదైనా...
గుర్తుంచుకో, మన జీవితాలన్నీ పురాతన స్వప్నాలే

కత్తులయ్య మరణించాడు
రవ్వంతైనా సవ్వడి సేయకుండా
కత్తులయ్య మరణించాడు
మందుపాతరల అగాధాలపై చిరు వంతెనైనా
వేయకుండానే కత్తులయ్య నిద్దరోయాడు

మళ్లీ ఒక విధ్వంసం జరగబోతున్నది
కోతి రొట్టెలతో ఆడుకుంటూనే వున్నది
రొట్టె ఇపుడు నేతి వాసన వేయడం లేదు
కుట్ర వాసన వేస్తున్నది

పేతులూ, మరల మరల మరల మరచినను
వదలనిదే చరిత్ర
మన ముందు మన మహాస్వప్నం నిలిచే వున్నది
కత్తులతో తెగనిది, నిప్పులతో కాలనిది చరిత్ర
చరిత్ర నెవరూ తగులబెట్టలేరు

– సీతారామ్మోహన్